క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

లక్సెట్టిపేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల బీఎల్‌వీ దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. వివరాల ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతులలో మిగిలిన సీట్ల కోసం అర్హత కల్గిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9704550167నంబరులో సంప్రదించాలని కోరారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

నస్పూర్: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎవరైనా దుకాణాదారులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. పట్టణ పరిధిలోని పలు దుకాణాదారులపై మంగళవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రైడ్ నిర్వహించారు. పలు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లడ్ కాలనీ వద్ద గల ఓ కిరాణ నిర్వాహకులకు రూ.1000జరిమానా విధించారు. అనంతరం పలు వాణిజ్య, వ్యాపారస్తులతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించినట్లు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ విక్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది పీ.పవన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి

శ్రీరాంపూర్: ఏరియా డిస్పెన్సరీలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని దీంతో పాటు మెడికల్ సిబ్బందిని నియమించాలని బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నా తాడి శ్రీధర్ రెడ్డి యాజమాన్యాన్ని డి మాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కంపెనీలో అతిపెద్ద డివిజన్ అయిన శ్రీరాంపూర్‌లో ఎక్కువ మంది కార్మికులు ఉన్నారని, వారికి తగిన వైద్య సేవలు అందించడానికి సరిపడినంత వైద్యులను నియమించాలన్నారు. ఇక్కడి డిస్పెన్సరీ ల్లో సిటీ స్కాన్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల వైద్యులు, మహిళల కోసం గైనకాలజిస్టులను నియమించాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ

భీమారం: మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఎంపీడీవో రాధ పరిశీలించారు. ఈ మేరకు మురుగుకాలువల్లో చెత్త తీస్తున్న కార్మికులతో మాట్లాడారు. ప్రతీరోజు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. విధిగా పారిశుధ్య పనులను చేపట్టాలని కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు.

బెల్లంపల్లి మహిళకు పీహెచ్‌డీ



శ్వేత

బెల్లంపల్లి: టేకుల బస్తీకి చెందిన కలకుంట్ల శ్వేత పీహెచ్‌డీ పట్టాను సాధించారు. భౌతికశాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను ఉస్మానియా యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్‌ను ప్రకటించింది. త్వరలోనే శ్వేతకు పట్టాను అందజేయనున్నారు. 2017లో భౌతిక శాస్త్ర విభాగంలో ప్రవేశం పొందిన శ్వేత డాక్టర్ వై.కల్యాణలక్ష్మి మార్గదర్శకంలో పరిశోధనలు సాగించారు. 'స్టడీ ఆన్ ది ఎఫెక్ట్ ఆఫ్ మాంగనీస్ నాన్ స్ట్రాయికియోమెట్రీ అండ్ అడిటివ్స్ ఆన్ మాగ్నెటిక్ అండ్ మాగ్నెటో ట్రాన్స్‌ఫోర్ట్ బిహేవియర్ ఆఫ్ లాంతనం ట్రాన్షియం మాంగనైట్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనలు డాక్టరేట్ ఇవ్వడానికి దోహదపడ్డాయి. కలకంట్ల కనకలక్ష్మి, తిరుపతి దంపతులకు ముగ్గురు సంతానంలో ప్రథమ పుత్రిక అయిన శ్వేత పట్టుదలతో ఉస్మానియా యూనివర్సిటీలో భౌతికశాస్త్రంలో పరిశోధనలు చేసి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. శ్వేతకు డాక్టరేట్ పట్టా రావడంపై తల్లిదండ్రులు, బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

డేంజర్.. యూటర్న్!

- ప్రమాదాల నిలయంగా 'తిరుమల హిల్స్ యూటర్న్'
- ఆరు నెలల వ్యవధిలో ఏడుగురు మృత్యువాత
- దిద్దుబాటు చర్యలపై దృష్టి సారించని హైవే అధికారులు
- నేడు ఆర్డీవో కార్యాలయంలో పలు శాఖల అధికారుల సమావేశం
- రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



కన్నాల తిరుమల హిల్స్ వద్ద యూటర్న్

బెల్లంపల్లి: మంచిర్యాల–చంద్రాపూర్ జాతీయ రహదారి బెల్లంపల్లి శివారు కన్నాల పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో ఎక్కడ లోపం జరిగిందో, తప్పిదం ఎవరిదో తెలియదు కానీ ప్రజల ప్రాణాలు మాత్రం గాలిలో కలుస్తున్నాయి. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం ఆరు నెలల్లో ఏడుగురి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిశాయి. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తరచూ సుబ్బారావు మామిడి తోట మూలమలుపు వద్ద నుంచి తిరుమల హిల్స్ యూ టర్న్ మధ్య జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఆ ప్రాంతంలోనే ఎందుకు..?

తిరుమల హిల్స్ వద్దనే జాతీయ రహదారిపై ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతుండగా, యూటర్న్ వద్ద, కొద్ది దూరం ముందు ప్రమాదాలు జరగడం యాధృచ్ఛికంగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ తీరుగా వేర్వేరుగా రోడ్డుప్రమాదాలు జరిగి ఏడుగురి నిండు ప్రాణాలు పోయాయి. ప్రధానంగా హైవేపై యూటర్న్ ఇవ్వడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఆ ప్రాంతంలో పెట్రోల్ బంక్, తిరుమల హిల్స్‌లో నివాసాలు ఉండటం మూలంగా రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చి ఢీ కొంటున్నాయి. వాస్తవానికి అ ప్రాంతంలో యూటర్న్ ఇవ్వడం సరికాదనే వాదన వినపడుతోంది. కొందరి ఒత్తిళ్ల వద్ద ఎన్‌హెచ్ అధికారులు యూటర్న్‌కు అవకాశం కల్పించి అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు భద్రతపై చిత్తశుద్ధి ఏదీ...!

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు విరివిగా జరుగుతున్నా హైవే అధికారులు కనీస చలనం లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రోడ్డు భద్రతపై సరిగా దృష్టిసారించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాహనదారుల నుంచి టోల్ ఫీజు వసూలు చేయడానికి చూపిస్తున్న ఆసక్తి భద్రతపై లేకుండా పోతోందని వాహనదారులు ఆగ్రహం చెందుతున్నారు. ఏ ప్రాంతంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, అందుకు గల కారణాలేంటీ, ఎక్కడ లోపాలు ఉన్నాయి, ఎలాంటి భద్రత చర్యలు తీసుకోవాలనే అంశాలను గాలికి వదిలేసినట్లుగా తెలుస్తోంది. డ్రంక్‌అండ్ డ్రైవ్, వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టకపోవడం వంటి ప్రతి కూలంశాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం మూలంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

హైవే మార్గంలో...

జాతీయ రహదారి వెంట విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. గంజాయి మత్తులో యువత వాహనాలతో హైవే పై దూసుకువెళ్తున్నారు. ఇబ్బడి ముబ్బడిగా వెంచర్లు ఏర్పడుతున్నాయి. దీంతో వాహన చోదకుల రద్దీ విపరీతంగా పెరిగింది. అనేక మంది సరైన అవగాహన లేక యూటర్న్ వద్ద వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా మలుపుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. అక్రమంగా సాగిస్తున్న మద్యం అమ్మకాలను నిరోధించాలని, హోటళ్లు, వెంచర్ల వల్ల కలుగుతున్న అవరోధాలను సరిచేయాలని కన్నా ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మంద అనిత కలెక్టర్ సంతోష్‌కు, ఇతర అధికా రులకు వినతిపత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్ స్పందించి నేషనల్ హైవే, ఎక్సైజ్, పోలీసు, మున్సి పల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడానికి ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రాజకీయ, పుర ప్రముఖులు, పౌరుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు.

ప్రమాదాలు నివారించాలి



నేషనల్ హైవేపై జరుగుతున్న రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఏ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయో సంబంధిత అధికారులు ఇప్పటికీ గుర్తించకపోవడం శోచనీయం. ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా, హైవే అధికారులు లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇది సరైంది కాదు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎండి.అబ్దుల్ నవీద్, బెల్లంపల్లి

సూచికలు ఏర్పాటు చేయాలి



కన్నాల యూటర్న్ వద్ద తగిన భద్రత చర్యలు తీసుకోవాల్సి ఉంది. నిబంధనల ప్రకారం యూటర్న్ ఏర్పాటు చేశారా లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా అనేది తేల్చాలి. నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసినట్టైతే వెంటనే తగిన సూచికలు, తగినంత వెలుతురును ఇచ్చే లైట్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలి. వాహనదారుల ప్రాణాలు పోకుండా చూడాలి.

– మోదంపల్లి కిరణ్‌కుమార్, బెల్లంపల్లి

చర్యలు చేపట్టాలి



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు వాహనదాలను భయాందోళనకు గురిచేశాయి. బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు బైక్‌పై వెళ్లడానికి భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. లారీలు ఇతర వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నాయి. వీటి నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల వాహనదారులకు అడ్డులేకుండా పోతోంది. కట్టడి చర్యలు తక్షణమే చేపట్టాలి.

– గరిగే బాబ్జీ, బెల్లంపల్లి

తగిన నిర్ణయం తీసుకోవాలి



టోల్‌ఫీజు చెల్లించి హైవే రోడ్కెక్కుతున్న వాహన దారుల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోంది. ఎప్పటికప్పుడు రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలి. పోలీసు ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు తీసుకుని వాహనదారుల్లో ధైర్యం కల్పించాలి. ఇందుకు సంబంధిత అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలి.

– ఎం.రమేశ్, బెల్లంపల్లి

హోమ్ ఓటింగ్ ఫారాల పంపిణీ



హోమ్ ఓటింగ్ పత్రాలు అందజేస్తున్న బీఎల్‌ఓ

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో 80సంవత్సరాలు పైబడిన వారికి కలెక్టర్, బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఇంటి వద్దకు వెళ్లి హోమ్ ఓటింగ్ పత్రాలను బీఎల్‌ఓలు పంపిణీ చేశారు. ఇంటి వద్దనే ఓటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆదిత్య హై స్కూల్ విద్యార్థులు పోగుచేసిన రూ.12,099నగదును గోదావరిఖనిలోని బాల సంరక్షణ సంస్థ నిర్వాహకురాలు రమణమ్మకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించగా, ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, కరస్పాండెంట్ సాయికిరణ్ వర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడితోట దగ్ధం



దగ్ధమైన తోట వద్ద బాధితుడు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామ శివారులోని ఏల్పుల వెంకటి అనే రైతుకు సంబంధించిన మూడెకరాల మామిడి తోట మంగళవారం కాలిపోయింది. యాదృచ్ఛికంగా కాలిందా లేక ఎవరైనా కావాలని కాలబెట్టారా అనే విషయం అర్థం కావడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి చెట్లకు వాటర్ సరఫరా కోసం అమర్చిన ప్లాస్టిక్ పైపులు కూడా కాలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలని విలపించాడు.

నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు



లక్ష్మీగణపతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

భీమిని: మండలంలోని మల్లీడి గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండు రోజుల పాటు జరుగనుండగా మంగళవారం కనుల పండువగా ప్రారంభించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, జలాధివాసం, ధాన్యాధివాసం, నవగ్రహ హోమం, మండప హోమాలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి, శివపంచాయతన, నవగ్రహ విగ్రహాలను గ్రామంలో బాజాభజంత్రీలతో ఊరేగించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. బుధవారం యంత్ర ప్రతిష్ఠ శాంతి పౌష్టికహోమాలు, బలి ప్రవాసం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న దంపతులు

పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తాండూర్ మండలం అచ్చలాపూర్ వేదపాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు దుద్దిళ్ల మనోహర అవధాని, ముద్దు దీరజ్ శర్మ, శివ శర్మ, ఇనేష్‌శర్మ ప్రతిష్ఠా క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలు అపరిశుభ్రం



దండేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిసరాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ఆసుపత్రి మరమ్మతుల్లో భాగంగా చెత్తను ఆసుపత్రి పరిసరాల్లో వేసి అలాగే ఉంచారు. దానిని తొలగించకపోవడంతో పరిసరాలంతా అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఆసుపత్రి పరిసరాల్లో చెత్తను తొలగించి, సీసీ వేసి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

'ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యేగా గెలిచిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై అనవసరంగా లేనిపోని ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుకు సంబంధించిన నాయకులు, ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని, ప్రజలు ఎందుకు పీఎస్సార్‌కు ఓటు వేసి గెలిపించారో ఆలోచించాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూదరి ప్రభాకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ మాట్లాడారు. భూములను లాక్కోవడం, ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో అంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజల తీర్పు మేరకు ఎమ్మెల్యేగా ప్రేమ్‌సాగర్‌రావు గెలిచి, అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, కౌన్సిలర్లు వేములపల్లి సంజీవ్, ప్రకాశ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



వేమనపల్లి: పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై



లక్సెట్టిపేట: మాట్లాడుతున్న తహసీల్దార్



బొమ్మెన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

లక్సెట్టిపేట: ఎంపీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అన్ని సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కోడ్ నిబంధనలు పాటించేలా చూడాలని, ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జన్నారం: మండలంలోని బొమ్మెన, మహ్మదాబాద్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ర్యాంపులు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లి, సూరారం, నాగారాం, జిల్లెడ, బుయ్యారం, వేమనపల్లి, రాజారాం, దస్నాపూర్, గొర్లపల్లి గ్రామపంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమేష్, ఎస్సై శ్యాంపటేల్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలు ఉండాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్ఐ లక్ష్మీనారాయణ, బీఎల్‌ఓలు ఉన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

భీమిని: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేశారు. కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి నుంచి ఇసుక లోడ్‌తో, జజ్జరవెల్లి నుంచి మట్టి తీసుకెళ్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్లు సత్రవేని బాపు, వడుగూరి రమేష్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చెన్నూర్: పట్టణంలోని అనూస్ మసీదులో కాంగ్రెస్ నాయకులు గట్ల చందర్ రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, నిజాం అలీ, హసన్ సాబ్రి పాల్గొన్నారు.

అక్రమపట్టా రద్దు చేయాలని ఆందోళన

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉరితాళ్లతో నిరసన
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



ఆందోళన చేస్తున్న బాధితులు

బెల్లంపల్లి: అక్రమ పట్టాను రద్దు చేసి వారసత్వంగా వస్తున్న తమభూమి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఓ బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సామూహికంగా ఉరితాళ్లతో వచ్చి న్యాయం చేయకపోతే తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితుడు జాడి తిరుపతి మాట్లాడుతూ.. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులో తన తాత దుర్గం లస్మయ్య పేరు మీద 2.75ఎకరాల అసైన్డ్ భూమి ఉందన్నారు. 1956నుంచి 2018వరకు ఆ భూమి ఆన్‌లైన్ రికార్డులో ఉందని వివరించారు. ఆ భూమిని సోమగూడెంకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సింగిల్‌విండో చైర్మన్ బుక్య రాంచందర్, మంచిర్యాల వాసి సత్యరాజు, అనుచరులు బోడ పరశురాం, కిషన్, రవిలు అక్రమంగా కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి తమకు అప్పగించి పట్టేదారు పాసు పుస్తకం ఇప్పించాలని వేడుకున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కలెక్టరేట్ వద్దకు వెళ్లి ఉరితాళ్లతో ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణం వేరే చోటుకు మార్చండి..!



నెన్నెల మండలంలోని జెండావెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఊరు శివారులో క్రీడా ప్రాంగణం, శ్మశానవాటిక పక్క పక్కనే నిర్మించడంతో విద్యార్థులు, యువత అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. క్రీడాప్రాంగణం, శ్మశాన వాటికను గ్రామస్తులు వినియోగించడం లేదు. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాన్ని మరో చోటుకు మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. – నెన్నెల